క్లుప్తంగా

మలబార్ గోల్డ్ షోరూంలో వెండి ఆభరణాల ప్రదర్శన



పాత గుంటూరు: లక్ష్మీపురంలోని మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ షోరూంలో వెండి ఆభరణాల ప్రదర్శనను వినియోగదారులు పెద్ది రమణా రావు, అనూహ్య, అంజు, ప్రవళిక, అపర్ణ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా స్టోర్ హెడ్ నదీర్, మార్కెటింగ్ మేనేజర్ గోపీకిరణ్ మాట్లాడుతూ ఈ నెల 25 వరకు షోరూంలో వెండి ఆభరణాలు, వస్తువులను ప్రదర్శించనున్నట్లు పేర్కొన్నారు. రూ.5 వేలు వెండి ఆభరణాల కొనుగోలుపై రూ.500 తగ్గింపు ఉంటుందని తెలిపారు. వెండి వస్తువులపై రాయితీలు కూడా అందిస్తున్నామని,వినియోగదారులు షోరూంను సందర్శించాలని వారు కోరారు.

జర్నలిస్టు నార్లకు ఘన నివాళి



లక్ష్మీపురం: నిజాయతి, నిర్భీతి, నిబద్ధతకు నిలువెత్తు నిదర్శనం సంపాదకులు నార్ల వెంకటేశ్వరరావు అని అవగాహన సంస్థ సభ్యులు కొనియాడారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో శుక్రవారం ఆయన వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సీనియర్ ఇంజినీర్ ఎస్. సదాశివం మాట్లాడుతూ కవిగా, రచయితగా, నాటక కర్తగా, విమర్శకుడిగా అనువాదకుడిగా, సంపాదకుడిగా నార్ల వెంకటేశ్వరరావు నేటి జర్నలిస్టులకు స్ఫూర్తి ప్రదాత అన్నారు. కార్యక్రమంలో అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, విద్యావేత్త ఆర్.వి.సింగరయ్య, బసవ గుప్తా, జనార్దనరావు, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

ఓటర్ల తుది జాబితాపై అప్రమత్తత అవసరం

కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: ఓటర్ల తుది జాబితా తరువాత అందిన మార్పు, చేర్పు, తొలగింపుల దరఖాస్తులను బూత్ లెవల్ అధికారులు(బీఎల్ఓ)లు ప్రత్యేక శ్రద్ధతో పరిశీలించాలని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ ఈఆర్వో కీర్తి చేకూరి తెలిపారు. బీఎల్ఓల నుంచి అందిన ఫారాలను వేగంగా ప్రాసెస్ చేయడానికి వార్డ్ ఎడ్యుకేషన్ కార్యదర్శులను కేటాయించాలని ఎన్నికల విభాగ అధికారుల్ని ఆదేశించారు. కమిషనర్ క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం ఓటర్ల తుది జాబితా తరువాత అందిన ఫారాలు, వాటి పరిష్కారాలపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓట్ల తొలగింపు దరఖాస్తులు వస్తే జిల్లా ఎన్నికల అధికారి ఆమోదం తప్పనిసరిని చెప్పారు. తుది జాబితాలో సక్రమంగా వచ్చే వరకు సూపర్వైజరీ అధికారులు పర్యవేక్షణ చేయాలని ఆమె సూచించారు. తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులపై సూపర్వైజరీ అధికారి, ఏఈఆర్ఓలకు నివేదిక ఇవ్వాలని బీఎల్ఓలను ఆదేశించారు. ఒక్కో నియోజకవర్గానికి 22 మంది సెక్టోరల్, 22 మంది రూట్ అధికారులను నియమిస్తున్నామని తెలిపారు. సమావేశంలో ఏఈఆర్ఓలు సీహెచ్.శ్రీనివాస్, టి.వెంకట కృష్ణయ్య, కె.వెంకట లక్ష్మి, ప్రదీప్ కుమార్, ఎస్.శ్రీనివాసరావు, మేనేజర్ శివన్నారాయణ, ఎన్నికల విభాగ సూపరింటెండెంట్ పద్మ, డెప్యూటీ తహసీల్దార్లు బి.భాస్కర్, మల్లేశ్వరరావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్

అభివ్యక్తి నైపుణ్యాల ద్వారా విస్తృత ఉపాధి అవకాశాలు

గుంటూరు ఎడ్యుకేషన్: అభివ్యక్తి నైపుణ్యాల ద్వారా విస్తృత ఉపాధి అవకాశాల్ని పొందవచ్చని ఏఎన్‌యూ ఆంగ్ల విభాగ అసిస్టెంట్ ప్రొఫెసర్ సీహెచ్.వి.మంజూష పేర్కొన్నారు. పట్టాభిపురంలోని టీజేపీఎస్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ''ఇంటర్వ్యూలను ఎదుర్కోవడం ఎలా'' అనే అంశంపై ఆంగ్ల భాషా విభాగ ఆధ్వర్యంలో డిగ్రీ తృతీయ సంవత్సర విద్యార్థులకు సదస్సు నిర్వహించారు. ముఖ్యవక్తగా పాల్గొన్న మంజూష మాట్లాడుతూ డిగ్రీ తరువాత విద్యార్థులు ఉపాధి అవకాశాల కోసం ప్రయత్నించే క్రమంలో ఒక్కోసారి కొన్ని కారణాల వల్ల విజయం సాధించలేకపోతున్నారని, దాన్ని అధిగమించేందుకు కొన్ని ప్రత్యేక లక్షణాల్ని కలిగి ఉండాలని తెలిపారు. ఇంటర్వ్యూకు వెళ్లే ముందు వేషధారణతో పాటు చక్కటి రెజ్యూమ్‌ను సిద్ధం చేసుకోవాలని సూచించారు. సరళమైన భాష, భావ వ్యక్తీకరణ, నవ్వుతూ పలకరింపు వంటి అంశాలు ఆత్మవిశ్వాసాన్ని కలిగిస్తాయని వివరించారు. ఎప్పటికప్పుడు మారుతున్న కాలానికి అనుగుణంగా నవీకరణ చెందాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చి వారిలో ఆత్మ విశ్వాసం నింపారు. సాధనతో ఎంతటి కార్యాన్నైనా సునాయాసంగా అధిగమించవచ్చునని వివరించారు. సదస్సులో కళాశాల ప్రిన్సిపాల్ ఏబీపీ మనోహర్, కరస్పాండెంట్ కేవీ బ్రహ్మం, ప్రజ్ఞ స్కూల్ కరస్పాండెంట్ ఎస్. చక్రనాగ్, కళాశాల ఆంగ్లవిభాగాధిపతి పి. నాగమణి, అధ్యాపకులు జి. భాగ్యమ్మ, డాక్టర్ సుధీర్ కుమార్, జయ శైలజ, అంజనీ కుమార్, సురేష్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏఎన్‌యూ ఆంగ్ల విభాగ అసిస్టెంట్ ప్రొఫెసర్ మంజూష

కరెన్సీపై అంబేడ్కర్ చిత్రపటాన్ని ముద్రించాలి

నెహ్రూనగర్: భారత కరెన్సీపై అంబేడ్కర్ చిత్రపటాన్ని ముద్రించాలని అంబేడ్కర్ ఆశయ సాధన సమితి జాతీయ అధ్యక్షుడు కాల్వ రవి డిమాండ్ చేశారు. ఆయన శుక్రవారం అంబేడ్కర్ భవన్‌లో పలు దళిత సంఘాల నాయకులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంబేడ్కర్ చిత్రపటాన్ని భారత కరెన్సీపై ఏర్పాటు చేయాలని 13 ఏళ్ల నుంచి పోరాడుతున్నామని, కానీ పాలకులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. రిజర్వు బ్యాంక్ స్థాపన, జాతీయకరణలో అంబేడ్కర్ కృషి ఎనలేనిదని తెలిపారు. ఈ మేరకు ఈ నెల 27న ఉదయం జిల్లా కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకరావు సంఘీభావం తెలియజేశారు. అనంతరం నిరసన కార్యక్రమ పోస్టర్లు=ను ఆవిష్కరించారు. సమావేశంలో దళిత సంఘాల నాయకులు డాక్టర్ గోళ్లమూడి రాజసుందరబాబు, అన్నవరపు కిశోర్, నల్లపు నీలాంబరం, బొమ్మిశెట్టి దుర్గా, చార్వాక, అడపా మోహన్, జెడ్డా జ్యోతిరాజు, రాజేష్ పాల్గొన్నారు.

ప్రజల భాగస్వామ్యంతోనే పట్టణాభివృద్ధి

మేయర్ కావటి

నెహ్రూనగర్: పట్టణాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని నగర మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు అన్నారు. పశ్చిమ నియోజకవర్గం 18వ డివిజన్ ఆర్. అగ్రహారం శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయం మెయిన్ రోడ్డు నుంచి గాంధీ బొమ్మ సెంటర్ వరకు నగరపాలక సంస్థ రూ.85 లక్షల ఎస్‌క్యాప్ నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్లు, డ్రెయిన్లు, తాగునీటి పైపులైన్ పనులను అధికారులు స్థానిక ప్రజలతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ఆర్.అగ్రహారంలో రోడ్లు, డ్రెయిన్లు శిథిలావస్థకు చేరడంతో ప్రజావసరాల దృష్ట్యా నూతనంగా నిర్మాణాలకు అనుమతులు ఇచ్చినట్లు చెప్పారు. నిర్దేశిత గడువులోగా పనులు చేపట్టకపోతే నిధులు వెనక్కు వెళ్లే అవకాశం ఉందన్నారు. రోడ్డు, డ్రెయిన్ నిర్మాణానికి ఆక్రమణలు అడ్డంకిగా ఉన్నట్లు అధికారులు గుర్తించారని, వాటిని స్థానికులే స్వచ్ఛందంగా తొలగించుకొని నగరపాలక సంస్థకు సహకరించాలని ఆయన కోరారు. ఆక్రమణల తొలగింపులో ప్రజలకు ఎక్కువగా నష్టం వాటిల్లకుండా చర్యలు తీసుకుంటామని మేయర్ తెలిపారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ నిమ్మల వెంకటరమణ, స్థానిక పెద్దలు అశోక్ జైన్, మహావీర్ జైన్, మదన్, వేణు, దర్శి హనుమంతరావు, నగరపాలక సంస్థ ఏసీపీ అజయ్, డీఈఈలు, ఏఈలు, పట్టణ ప్రణాళిక అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



స్థానికులతో మాట్లాడుతున్న మేయర్ కావటి

రేపు శ్రీ వైష్ణవి హాస్పిటల్ ప్రారంభోత్సవం

గుంటూరు మెడికల్: కిడ్నీ బాధితులకు అత్యాధునిక వైద్య సేవలు చేరువ చేసేందుకు శ్రీ వైష్ణవి హాస్పిటల్‌ను ఈనెల 18న ప్రారంభిస్తున్నామని ప్రముఖ కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్స నిపుణులు, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కిలారి సునీల్‌కుమార్ చెప్పారు. శుక్రవారం అరండల్‌పేటలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. గుంటూరు కాకాని రోడ్డు బీఎస్ఎన్ఎల్ కార్యాలయం ఎదురుగా వంద పడకలతో నూతనంగా నిర్మించిన 'శ్రీ వైష్ణవి హాస్పిటల్' ఆదివారం ఉదయం 11.15 గంటలకు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఆసుపత్రి ప్రారంభోత్సవానికి రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని ముఖ్య అతిథిగా, విశిష్ట, ప్రత్యేక అతిథులుగా ప్రముఖ వైద్యులు డాక్టర్ మద్దినేని గోపాలకృష్ణయ్య, పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు, గుంటూరు తూర్పు, పశ్చిమ శాసనసభ్యులు షేక్ మహమ్మద్ ముస్తఫా, మద్దాళి గిరిధర్ రావు, జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి, నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు, నగరపాలక సంస్థ కమిషనర్ కీర్తి చేకూరి, సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ, రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావుతో పాటు నగరంలోని ప్రముఖ వైద్యులు, వివిధ పార్టీల ప్రజాప్రతినిధులు పాల్గొంటారని వెల్లడించారు. గుంటూరు నగరంలో 17 సంవత్సరాలుగా కిడ్నీ వైద్య సేవలు అందిస్తున్నామని, ఎన్నో క్లిష్టమైన ఆపరేషన్లు విజయవంతంగా చేసి పలువురి ప్రాణాలు కాపాడామని తెలిపారు. సమావేశంలో సి.రవీంద్ర, పీఆర్వో రమేష్ పాల్గొన్నారు.



ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న డాక్టర్ సునీల్‌కుమార్, డాక్టర్ రాధికారాణి తదితరులు

సెల్ టవర్ ఎక్కి టెన్షన్ పెట్టిన వ్యక్తి

- గుంటూరులోని శ్రీనగర్‌లో సంఘటన
- ఇంటి వద్ద కుళాయి విషయంపై వివాదం
- మనస్తాపంతో సెల్ టవర్‌పై బైఠాయింపు
- సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చి కిందకు దించిన సీఐ వెంకటేశ్వరరెడ్డి



సెల్‌టవర్ ఎక్కికూర్చున్న కోటేశ్వరరావు



కోటేశ్వరరావుకు నచ్చచెప్పి కిందకు తీసుకువచ్చిన సీఐ

గుంటూరు ఎడ్యుకేషన్: ఇంటి దగ్గర కుళాయి విషయమై ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఓ వ్యక్తి సెల్ టవర్ ఎక్కిన సంఘటన శుక్రవారం శ్రీనగర్‌లో చోటు చేసుకుంది. శారదాకాలనీ 16వ లైనుకు చెందిన 63 ఏళ్ల వెలగాల కోటేశ్వరరావు తన స్థలంలో రేకుల షెడ్డు నిర్మించుకుంటున్నాడు. నిర్మాణ పనులకు నీరు అవసరం కావడంతో కుళాయి కనెక్షన్ కోసం స్థానిక వార్డు సచివాలయంలో అర్జీ పెట్టుకున్నాడు. అయితే, ఇల్లు లేకుండా కనెక్షన్ ఇచ్చేందుకు వీల్లేదని, కనీసం గోడలపై రేకులు అయినా ఏర్పాటు చేసుకోవాలని సిబ్బంది సూచించారు. దీంతో తన ఇంటి ముందు ఉన్న వాళ్ల ఇంట్లో నుంచి పైపుద్వారా నీటిని తెచ్చుకుని వాడుకుంటున్న నేపథ్యంలో పైపులైను విషయమై పలు వివాదాలు చోటు చేసుకున్నాయి. దీంతో మనస్తాపానికి గురైన కోటేశ్వరరావు శ్రీనగర్ ఏడో లైను చివర్లో భారతి స్కూలు సమీపంలో ఉన్న సెల్ టవర్ సగం వరకు ఎక్కి అక్కడే కూర్చున్నాడు. ఉదయం ఆరు గంటల నుంచి మూడు గంటల పాటు అక్కడే ఉన్న కోటేశ్వరరావుకు ఎంత మంది వచ్చి, సర్ది చెబుతున్నా కిందకు దిగి రాలేదు. సమాచారం తెలుసుకున్న అరండల్‌పేట సీఐ ఐ. వెంకటేశ్వరరెడ్డి అక్కడికి చేరుకున్నారు. సెల్ టవర్ ఎక్కిన కోటేశ్వరరావుతో ఫోన్‌లో మాట్లాడి, సమస్య తాను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ఎట్టకేలకు దిగి కిందికి వచ్చాడు. కుళాయి కనెక్షన్ ఇవ్వడానికి ఇబ్బందులకు గురి చేసిన వారిపై చర్యలు తీసుకుంటామని చెప్పడంతో అతను శాంతించాడు. ట్యాప్ కనెక్షన్ విషయమై ఆయన అక్కడికి చేరుకున్న నగరపాలకసంస్థ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కోటేశ్వరరావు, ఏఈ అనూషతో మాట్లాడారు. సీఐ వెంట ఎస్ఐ పి.భాగ్యరాజు ఉన్నారు.

తాగునీటి అవసరాలకు మాత్రమే ట్యాప్ కనెక్షన్ మంజూరు

నెహ్రూనగర్: తాగునీటి అవసరాలకు మాత్రమే ట్యాప్ కనెక్షన్ ఇస్తామని నగర కమిషనర్ కీర్తి చేకూరి స్పష్టం చేశారు. శ్రీనగర్‌లో శుక్రవారం కుళాయి కనెక్షన్ కోసం కోటేశ్వరరావు అనే వ్యక్తి సెల్ టవర్ ఎక్కిన విషయం తెలుసుకున్న కమిషనర్ అక్కడికి ఇంజినీరింగ్ అధికారుల్ని పంపి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కమిషనర్ ఆదేశాలతో శ్రీనగర్‌కు చేరుకున్న ఈఈ కోటేశ్వరరావు సెల్ టవర్ ఎక్కిన వ్యక్తితో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇంటిపై అదనపు గదుల నిర్మాణం చేపడుతున్న నేపథ్యంలో కనెక్షన్ ఇవ్వడం కుదరదని తెలిపారు. ఇంటి నిర్మాణం అనంతరం తాగునీటి అవసరాలకు మాత్రమే ఇస్తామని చెప్పారు.

ప్రత్యేక అవసరాల పిల్లలకు సాయం అందించాలి

గుంటూరు మెడికల్: ప్రత్యేక అవసరాల పిల్లలకు ప్రతి ఒక్కరూ సాయం అందించాలని నగర డెప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు (డైమాండ్‌బాబు) కోరారు. స్థానిక మల్లికార్జునపేట లోని సెయింట్ ఆన్స్ పాఠశాలలో ప్రత్యేక అవసరాల పిల్లలకు శుక్రవారం శారదాకాలనీ అంగన్‌వాడీ సిబ్బంది పౌష్టికాహారం అందజేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న డెప్యూటీ మేయర్ బాలవజ్రబాబు మాట్లాడుతూ అంగన్‌వాడీ సిబ్బంది దివ్యాంగులకు సహాయం చేయడం అభినందనీయమన్నారు. ప్రతి ఒక్కరూ సేవాభావంతో ముందుకు వచ్చి సమాజాన్ని చైతన్య పథం వైపు నడిపించాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు శాంతి, పూర్ణిమ, దారుబాయి, మార్తమ్మ, నందు, భవాని, సుబ్బాయమ్మ, సౌమ్య, పద్మావతి పాల్గొన్నారు.



చిన్నారులకు పౌష్టికాహారం వడ్డిస్తున్న డెప్యూటీ మేయర్

పంచకర్మ థెరపిస్ట్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానం

గుంటూరు మెడికల్: జీజీహెచ్ ఆవరణలోని ప్రభుత్వ యునాని, న్యాచురోపతి యోగ వైద్యశాలలో పంచకర్మ థెరపిస్ట్ (రిజిమెంటల్ థెరపీ)గా పనిచేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డాక్టర్ రావూరి మౌనిక శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సైన్స్ డిగ్రీ లేదా ఫిజియోథెరపీ కోర్సు చేసి అనుభవం ఉన్నవారు అర్హులన్నారు. ఎంపికైన వారు ప్రతిరోజూ నాలుగు గంటలు పని చేయాలని, నెలకు గౌరవ వేతనంగా రూ. 10వేలు ఇస్తారని పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత ఉన్నవారు 8309599643 నంబరులో సంప్రదించాలని ఆమె కోరారు.

విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాల పరిశీలన

గుంటూరు ఎడ్యుకేషన్: ఏటీ అగ్రహారం మహబూబ్‌నగర్ కాలనీలోని ప్రభుత్వ ఉర్దూ ప్రాథమిక పాఠశాలను ఉర్దూ పాఠశాలల ఉప తనిఖీ అధికారి షేక్ మొహ్మద్ ఖాసిం శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను ఆయన పరిశీలించారు. ప్రతి విద్యార్థి పాఠ్యాంశాలను చదివే విధంగా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని సూచించారు. వర్క్ బుక్స్ పెండింగ్ లేకుండా చూడాలని తెలిపారు.

డ్రైవింగ్ నిబంధనలు పాటించడం తప్పనిసరి

పట్నంబజారు: డ్రైవర్లంతా తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని డీటీసీ షేక్ కరీం చెప్పారు. స్వర్ణభారతీ నగర్‌లోని ఆర్టీఏ కార్యాలయంలో శుక్రవారం లారీ డ్రైవర్లు, అసోసియేషన్ సభ్యులు, యజమానులతో రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీటీసీ మాట్లాడుతూ డ్యూటీకి వెళ్లే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ముందుగా వాహన స్థితిగతులను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. డ్రైవింగ్ చేసేటప్పుడు తమ వెనుక ఒక కుటుంబం ఉందన్న విషయాన్ని మరిచిపోరాదని సూచించారు. కార్యక్రమంలో రవాణా శాఖ అధికారులు శేఖర్, రాజకుమారి, ఎన్.గోపాల్, సౌజన్య పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

పట్నంబజారు: పురుగు మందు తాగి యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటనపై కేసు నమోదైంది. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెదనందిపాడు మండలం నాగులపాడు గ్రామానికి చెందిన నిజాంపట్నం సింహ కిశోర్ (28) సీఏ చదివాడు. ప్రస్తుతం ఢిల్లీలో ఉద్యోగం చేస్తున్నాడు. అయితే, తన విద్యార్హతకు తగ్గ ఉద్యోగం రాలేదని నిత్యం మనస్తాపానికి గురై బాధపడుతుండేవాడు. ఈ క్రమంలో ఈనెల 14న ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న గోల్డెన్ లాడ్జిలో రూము తీసుకుని పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. లాడ్జి నిర్వాహకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కుల దూషణపై కేసు నమోదు

కుల దూషణపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కోబాల్డ్‌పేటలో నివాసం ఉండే శ్యామలాదేవి కుమారుడు అనిల్, చాట్ల లక్ష్మి కుమార్తె బిందు నాగిని కులాంతర వివాహం చేసుకున్నారు. ఈ విషయంలో ఇద్దరు తల్లిదండ్రులకు విభేదాలు ఏర్పడ్డాయి ఈ నేపథ్యంలో శుక్రవారం చాట్ల లక్ష్మి, ఆమె కుటుంబ సభ్యులు దుర్గ, మౌలాబి, బాషాలు శ్యామలాదేవి ఇంటికి వెళ్లి సామాన్లు పగులగొట్టారు. శ్యామలాదేవిని కులం పేరుతో దూషించారు. దీనిపై ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు అండగా నిలిచిన సీఎం జగన్

పాత గుంటూరు: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ఆర్టీసీ ఉద్యోగులకు అండగా నిలిచి వారి ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్నారని వైఎస్సార్ ఎంప్లాయీస్ యూనియన్ గుంటూరు జిల్లా చైర్మన్ కె.రత్తయ్య, కార్యదర్శి వి.జయరావు తెలిపారు. ఆర్టీసీ బస్టాండులో శుక్రవారం నిర్వహించిన యూనియన్ సమావేశంలో జయరావు మాట్లాడారు. ఏడాదిగా పెండింగ్‌లో ఉన్న నైట్, డే అవుట్ అలవెన్స్‌లను మంజూరు చేయడంతో పాటు, ప్రతి నెలా క్రమం తప్పకుండా అలవెన్సులు వచ్చే విధంగా నిర్ణయం తీసుకున్న సీఎం జగన్‌కు ధన్యవాదాలు తెలిపారు. గత టీడీపీ హయాంలో రూ.5 వేల కోట్ల నష్టాల్లో ఉన్న ఆర్టీసీని ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వంలో విలీనం చేసి 54 వేల మంది ఉద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపారని తెలిపారు. గతంలో పీఎఫ్ లోన్లు నెలల తరబడి కూడా మంజూరు కాక ఉద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొన్నారని చెప్పారు. ప్రస్తుతం వారం రోజుల్లో అందిస్తున్న ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కిందని వివరించారు. ఆర్టీసీ ఉద్యోగులకు మేలు చేకూర్చిన ప్రభుత్వానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కోశాధికారి ఓ.లక్ష్మయ్య, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న యూనియన్ నేతలు

దేవాలయాల ఈఓగా శ్రీనివాసరావు

గుంటూరు ఈస్ట్: దేవదాయ శాఖలో జేవీఓగా విధులు నిర్వహిస్తున్న డి.శ్రీనివాసరావును లాలాపేట గ్రూపు దేవాలయాలకు అసిస్టెంట్ కమిషనర్, ఈఓగా శుక్రవారం ఉన్నతాధికారులు నియమించారు. చిత్తూరు జిల్లాలో పనిచేస్తున్న చంద్రమౌళిని గుంటూరు జేఏఓగా నియమించారు. ఇద్దరు శుక్రవారం విధుల్లో చేరారు.

ఎన్నికల హామీలను విస్మరించిన కేంద్ర ప్రభుత్వం

పాత గుంటూరు: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీల్ని అమలు పరచకుండా మోసగిస్తోందని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కంచుమాటి అజయ్ కుమార్ ధ్వజమెత్తారు. బీజేపీ ప్రభుత్వ రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా, ఢిల్లీలో రైతులు చేపట్టిన పోరాటానికి మద్దతుగా కార్మిక సంఘాల ఐక్యవేదిక, సంయుక్త కిసాన్ మోర్చా సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం బంద్‌తో పాటు నగరంలో నిరసన ప్రదర్శన నిర్వహించాయి. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకుడు పాశం రామారావు మాట్లాడుతూ వ్యవసాయం, పరిశ్రమలు, గనులు, విద్యుత్, అటవీ సంపద, రవాణా, బ్యాంకులు, ఎస్ఐసీ తదితర సంస్థలన్నిటిని అదానీ, అంబానీ వంటి కార్పొరేట్ కంపెనీలకు కేంద్ర ప్రభుత్వం అప్పగిస్తోందని ఆరోపించారు. కార్పొరేట్ కంపెనీలకు రాయితీలు ఇచ్చిన ప్రభుత్వం సామాన్య ప్రజల నిత్యావసర వస్తువులన్నింటి పైనా జీఎస్టీ పేరుతో పన్నులు పెంచి ఇబ్బందులకు గురి చేస్తోందని విమర్శించారు. రాష్ట్రాల హక్కుల్ని హరించి వేస్తున్న బీజేపీ ప్రభుత్వానికి రానున్న ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలు సంఘాల నాయకులు తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ వి.రాధాకృష్ణమూర్తి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి నేతాజీ, వివిధ సంఘాల నాయకులు మాల్యాద్రి, ఏ. అరుణ్ కుమార్, యు. గనిరాజు, బి. ముత్యాలరావు, పాటిబండ్ల కోటేశ్వరరావు, ఉల్లిగడ్డ నాగేశ్వరరావు, నాదెండ్ల బ్రహ్మయ్య, జి.వి. సురేష్, అంజిబాబు, మహమ్మద్ చిష్టి పాల్గొన్నారు.



నిరసన ప్రదర్శనలో పాల్గొన్న వివిధ సంఘాల నాయకులు